భయపడుతూ కూర్చుంటే, బతకలేవు. ఏదైనకాని అని, ఒక అడుగు ముందుకు వేసి చూడు. గెలుపు అయితే నిన్ను ముందుకు నడిపిస్తుంది. ఓటమి అయితే తర్వాత ఏంచేయాలో నేర్పిస్తుంది.


# DD9 వార్త

తెలుగు దినపత్రిక


**జాకొర–చందూర్ ఎత్తిపోతల పథకాల ట్రయల్ రన్ విజయవంతం**





సంపుటి : 02 సంచిక : 231 | హైదరాబాద్, ఏప్రిల్, శనివారం 11, 2026 | పేజీలు : 06 వెల : 3.00


# ఉపాధి కూలీల పైసలేవి?

- చెమటోడ్చి పని చేసిన కూలీలకు సకాలంలో కూలి చెల్లింపులు లేవు
- మూడు నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు
- సుమారు రూ.300 కోట్లు రావాల్సి ఉండగా, కేవలం రూ.57 కోట్లు మాత్రమే విడుదల
- కేంద్ర సర్కార్ కొర్రీలు.. రాష్ట్రం నిర్లక్ష్యం
- ఇద్దరి మధ్యన బలైపోతున్న కూలీలు
- ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా మూడు నెలలుగా వేతనాలు లేవు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్ఆర్ఈజీఎస్) లక్ష్యం నీరుగారుతున్నది. చెమటోడ్చి పనిచేసిన కూలీలకు సకాలంలో కూలి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. ప్రభుత్వ బాధ్యతారాహిత్యంతో లక్షలాది మందికి మూడు నెలలుగా కూలి డబ్బులు నిలిచిపోయాయి. రెకాడితేగానీ డొకాడని నిరుపేదలు, చెమట చిందించి చేసిన పనికి పైసా రాకపోవడంతో అల్లాడిపోతున్నారు. మూడు నెలలుగా కూలి డబ్బులు అందక, ఈ కేవైసీ కొర్రీలతో కూలీలు పనులకు వెళ్లడమే మానేస్తున్న దుస్థితి దాపురించింది. రూ.300 కోట్లు రావాల్సి ఉండగా, కేవలం రూ.57 కోట్లతో సర్దుకోమంటారా? అని కూలీలు మండిపడుతున్నారు. ఉపాధి పనులు చేయించే ఫీల్డ్ అసిస్టెంట్లకూ ..మిగతా 2లో

# తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు

- ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని స్పష్టం
- ప్రతిపక్షాల విమర్శలకు బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరిక
- "ఇందిరమ్మ రాజ్యం"కు ప్రజల మద్దతు కొనసాగుతుందని ధీమా
- భవిష్యత్తులో కూడా ప్రజలు దీవిస్తారని విశ్వాసం
- ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో గోదాము ప్రారంభోత్సవం
- రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- ధాన్యం సేకరణ తర్వాత వారం రోజుల్లోనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ..మిగతా 2లో

# సెమీకండక్టర్లలో స్వావలంబన!

- చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్ తయారీపై రాష్ట్రం దృష్టి
- ఈ ఏడాది కొత్త విధానం విడుదలకు సన్నాహాలు
- ఈఎంసీలు, నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు ప్రాధాన్యత
- సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ద్వారా ఏటా 5 వేల మందికి శిక్షణ




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలో చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్ తయారీ, సెమీకండక్టర్ రంగాన్ని బలోపేతం చేసేలా కొత్త విధానం రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0 (ఐఎస్ఎం రెండో దశ)తో అనుసంధానం చేస్తూ కొత్త పాలసీ రూపకల్పనపై కసరత్తు జరుగుతోంది. సెమీకండక్టర్ల రంగంలో తెలంగాణ స్వావలంబన సాధించడం లక్ష్యంగా ఈ పాలసీ ఉంటుందని సమాచారం.

ఇన్నాళ్లూ చిప్‌లు, సెమీకండక్టర్ల రంగంలో ఫ్యాబ్రికేషన్ (ఫ్యాబ్)కు పరిమితమైన స్థానిక తయారీ పరిశ్రమలను అధునాతన చిప్ డిజైన్ దిశగా మళ్లించేందుకు ..మిగతా 2లో

## కాళేశ్వరం పునఃవినియోగం హర్షనీయం

- ప్రభుత్వ ఆలస్యంతో నష్టపోయిన రైతులు
- ప్రాజెక్టు నీటిని సమర్థంగా వినియోగించని ప్రభుత్వం
- నీటి లభ్యత ఉన్నా సరైన ప్రణాళిక లేక ఇబ్బందులు
- ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయొద్దు
- పర్యావరణ సంరక్షణ, రైతుల హక్కులు కూడా ముఖ్యమే
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత రాష్ట్ర ప్రభుత్వ కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగంపై తీసుకున్న తాజా నిర్ణయాన్ని స్వాగతించారు. అయితే అదే సమయంలో గత ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండున్నరేళ్ల పాటు ప్రాజెక్టును సక్రమంగా వినియోగించకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ..మిగతా 2లో

## నోట్ల కట్టల ఆరోపణలు.. న్యాయమూర్తి రాజీనామా

- రాష్ట్రపతికి రాజీనామా పంపించిన జడ్జి
- జడ్జి ఇంట్లో అగ్నిప్రమాదం.. తగలబడ్డ నోట్ల కట్టలు
- భారత న్యాయవ్యవస్థలో తీవ్ర సంచలనం రేపిన ఘటన
- అంతర్గత విచారణకు ఆదేశించిన సీజేఐ
- చివరకు అక్రమాలు నిజమేనని తేల్చిన కమిటీ



**అలహాబాద్, (డిడి9 వార్త):**

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా చేయడం దేశ న్యాయవ్యవస్థలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఆయన పేరుతో ..మిగతా 3లో

## కేసీఆర్ ఆదేశాలు.. సాగునీరు విడుదల

- సిద్దిపేట జిల్లాలో పంటలు ఎండుతున్నాయంటూ ఫిర్యాదు
- తక్షణం స్పందించి అధికారులకు ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫోన్
- కొండపోచమ్మ జలాశయం నీటిని విడుదల చేయాలని ఆదేశం
- ప్రతిపక్ష నేత ఆదేశించినా స్పందించిన అధికారులు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలో సాగునీటి పంపిణీ విషయంలో మరోసారి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జోక్యం రైతులకు ఊరట కలిగించింది. సిద్దిపేట జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయనే సమాచారంపై ఆయన తక్షణ స్పందన చూపించడంతో, కొండపోచమ్మ సాగర్ జలాశయం నుంచి కాలువల ద్వారా నీటి విడుదలకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది. గత కొంతకాలంగా కొండపోచమ్మ సాగర్ నుంచి సంగారెడ్డి, ఆలేరు కాలువల ద్వారా సాగునీటి ..మిగతా 2లో

# మరో 42 మంది మావోయిస్టులు సరెండర్

- డీజీపీ ఎదుట లొంగిపోయిన నక్సలైట్లు
- గత ఏడాదిన్నరకాలంలో 763 లొంగిపోయిన వారిలో డిప్యూటీ కమాండర్ కేశాలు
- మొత్తం రూ.1.93 కోట్ల మేర రివార్డులు అందజేత



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలో అంతర్గత భద్రతా పరిస్థితులపై పోలీసు శాఖ చేసిన కృషి ఫలితంగా మావోయిస్టుల లొంగుబాట్లు పెరుగుతున్నాయని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా పోలీసుల ఎదుట లొంగిపోవడం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. గత ఏడాదిన్నర కాలంలో మొత్తం 763 మంది మావోయిస్టులు లొంగిపోయారని ఆయన తెలిపారు. ఈ పరిణామం రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలు ..మిగతా 3లో

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

- పెండింగ్‌లో ఉన్న డీఏ పెంపు
- 2.1 శాతం పెంచుతున్నట్టు ప్రకటించిన ప్రభుత్వం
- జనవరి 2026 నుంచి కొత్త డీఏ అమల్లోకి
- ఆర్టీసీ మీద నెలకు 2.82 కోట్ల అదనపు భారం
- ప్రభుత్వ నిర్ణయంతో ఆర్టీసీ ఉద్యోగుల హర్షం



DD9 వార్త
తెలుగు దినపత్రిక
DD9 Vaartha
శనివారం
11-04-2026
హైదరాబాద్

# ఉపాధి కూలీలకు పైసలేవి?

**మొదటిపేజీ తరువాయి**

మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. చట్టం ప్రకారం 15 రోజుల్లోగా కూలి డబ్బులు జమవ్వకపోతే రోజువారీగా లెకేసి పరిహారాన్ని అందించాలి. కానీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం బ్యాంక్ అకౌంట్లు, ఆధార్ లింక్ అంశాలను అడ్డు పెట్టుకొని పథకం ఉద్దేశాన్ని నీరుగారుస్తున్నది.

**5 లక్షల మంది కూలీలు దూరం..**

రాష్ట్రంలో 52.21 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, మొత్తం 1.07 కోట్ల మంది కూలీలు ఉన్నారు. వీరిలో యాక్టివ్‌గా పనిచేసే కూలీలు 49.64 లక్షల మంది. వీరికి కనీసం వంద రోజులకు తగ్గకుండా ఉపాధి కల్పించాల్సి ఉన్నది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జాతీయ మొబైల్ పర్యవేక్షణ విధానం(ఎన్‌ఎంఎంఎస్) ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి తెచ్చింది. ఈ యాప్‌లో కూలీల ముఖ ఆధారిత హాజరు తీసుకున్నాకే పని కల్పించాల్సి ఉంటుంది. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు యాప్‌లో కూలీల ఫొటో తీసినప్పుడు కూలీలు కనురెప్పలు మూసి తెరువాలి. ఇలా ఐదారుసార్లు చేయాలి. ఇలా ఒక్కొక్కరి ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఉదయం 8 గంటలకు ఒకసారి ఫొటో దిగితే, మళ్లీ మధ్యాహ్నం 12 గంటలకు (కనీసం 4గంటలు గ్యాప్) ఫొటో తీయడానికి ఆస్కారం ఉంటుంది. ఒక గ్రామంలో వంద మంది కూలీలు 45 ప్రాంతాల్లో పని చేస్తున్నారనుకుంటే అన్ని ప్రాంతాలకు వెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్ రెండుసార్లు అథెంటికేషన్ ఫొటో తీయాల్సిందే. లేకపోతే పనిచేసినా డబ్బులు జమకావు. ఈ ఫొటో క్యాప్చర్ ప్రక్రియను యాప్ సరిగ్గా గుర్తించకపోవడం, టెక్నికల్ సమస్యలు, సిగ్నల్స్ అందకపోవడంతో చాలామంది కూలీలు పనులకు దూరమవుతున్నారు. 2023 జనవరి 1 నుంచి కేంద్ర ప్రభుత్వం ఆధార్‌ను తప్పనిసరి చేసింది. కానీ, ప్రజలకు అవగాహన కల్పించటంలో విఫలమైంది. జాబ్‌కార్డుకు, ఆధార్, బ్యాంక్ అకౌంట్‌ను అనుసంధానించటం, పేర్లు, పుట్టిన తేదీల్లోని వివరాలు సరిపోలకపోవడం వల్ల రాష్ట్రంలో సుమారు 5 లక్షల మంది ఆధార్ పేమెంట్ సిస్టమ్‌లో తమ పేర్లు నమోదు చేసుకోలేకపోయారు. దీంతో వీరంతా ఉపాధి పనులకు దూరమయ్యారు. అంతేకాకుండా 700 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకూ 3 నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**పేరుకుపోయిన బకాయిలు**

యూపీఏ ప్రభుత్వం పనిని హకుగా కల్పిస్తే, ఎన్‌డీఏ సర్కార్ మాత్రం పని దినాలపై నియంత్రణ విధించింది. కొత్త నిబంధనల మేరకు రాష్ట్రాలు ఏడాదికి 60 రోజులను గుర్తించి పంట కాలంలో పనులు చేపట్టకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. గతంలో కేంద్రం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 శాతం నిధులు భరించాల్సి ఉండగా, దానికి కేంద్రం 60, రాష్ట్రాలు 40 శాతం భరించేలా మార్పులు తెచ్చారు. అయినా, కేంద్రం నుంచి రాష్ట్రానికి దాదాపు రూ.307 కోట్ల నిధులు అందాల్సి ఉన్నది. ఇప్పటివరకు కేవలం రూ.57 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ప్రతి నెలా రూ.100 కోట్ల చొప్పున మూడు నెలలకు రూ.300 కోట్లు పెండింగ్ ఉన్నాయి. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై రాష్ట్రం ఒత్తిడి తీసుకురాకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని ఉపాధి కూలీలు విమర్శిస్తున్నారు.



**రోజూ 8 లక్షల మందికి పని కల్పించాలి**

**- పీఆర్‌ఆర్డీ కమిషనర్ దివ్యాదేవరాజన్**

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిరోజూ 8 లక్షల మంది కూలీలకు ఉపాధి పని కల్పించడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేయాలని పీఆర్‌ఆర్డీ కమిషనర్ దివ్యాదేవరాజన్ ఆదేశించారు. పనుల పురోగతిపై ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని పేర్కొన్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటూనే.. కష్టపడి పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయం నుంచి డీఆర్డీవోలు, ఎంపీడీవోలు, ఏపీవోలతో వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ల ద్వారానే వీసీలో లాగిన్ అవ్వాలని, మొబైల్ ఫోన్ల ద్వారా వీసీకి హాజరయ్యేందుకు అనుమతి లేదని స్పష్టంచేశారు. కూలీల సంఖ్య తగ్గడానికి గల కారణాలను విశ్లేషిస్తూ, లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

## తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు

**మొదటిపేజీ తరువాయి**

ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా, కారుకూతలు కూసినా ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని, ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు తాము బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో నూతనంగా నిర్మించిన గోదాము ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం సేకరించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12,000 అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు దానిని బంగాళాఖాతంలో కలిపి, పారదర్శకమైన 'భూ భారతి' విధానాన్ని తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఎనభై వేల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా ఐదు వందల రూపాయల బోనస్ ఇస్తున్నామని, పండించిన సన్న బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించకుండా రేషన్ ద్వారా రాష్ట్రంలోని పేదలకు అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సీపీ సునీల్ దత్ మరియు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## కేసీఆర్ ఆదేశాలు.. సాగునీరు విడుదల

**మొదటిపేజీ తరువాయి**



అవసరాలకు నీటిని విడుదల చేస్తూ ఉన్నప్పటికీ, సిద్దిపేట జిల్లా ములుగు మండలంలోని కొన్ని గ్రామాలకు మాత్రం నీరు అందకపోవడం రైతులను ఆందోళనకు గురిచేసింది. ముఖ్యంగా కొట్యాల, అల్లీనగర్, అడవి మజీద్, క్షీరసాగర్, జప్తి సింగాయపల్లి గ్రామాల పరిధిలోని కాలువలకు నీటి సరఫరా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సమస్యను ఉమ్మడి మెదక్ జిల్లా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మాజీ డైరెక్టర్ అంజిరెడ్డి దృష్టికి రైతులు తీసుకువెళ్లారు. పంటల పరిస్థితి దారుణంగా ఉందని, తక్షణమే నీరు అందించకపోతే మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయనకు వివరించారు. రైతుల సమస్యను అత్యవసరంగా పరిగణించిన అంజిరెడ్డి, ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న కేసీఆర్‌ను కలిసి విషయాన్ని వివరించారు.

రైతుల ఇబ్బందులను విన్న కేసీఆర్ వెంటనే స్పందించారు. ఆలస్యం చేయకుండా నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. సంబంధిత ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి తెలిపారు. వెంటనే చర్యలు తీసుకుని కాలువల్లోకి నీటిని విడుదల చేయాలని స్పష్టమైన సూచనలు ఇచ్చారు.

మాజీ ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో నీటిపారుదల శాఖ అధికారులు తక్షణమే స్పందించారు. కొండపోచమ్మ సాగర్ నుంచి సంబంధిత కాలువల ద్వారా నీటి విడుదల ప్రారంభించారు. దీంతో కొట్యాల నుంచి జప్తి సింగాయపల్లి వరకు ఉన్న గ్రామాల పరిధిలో కాలువల్లో నీరు ప్రవహించడం ప్రారంభమైంది. చాలా రోజుల తర్వాత నీరు చేరడంతో రైతుల్లో ఆనందం నెలకొంది.

నీటి విడుదల అనంతరం కాలువల్లో ప్రవహిస్తున్న నీటిని అంజిరెడ్డి, సంబంధిత అధికారులు కలిసి పరిశీలించారు. నీటి ప్రవాహం సక్రమంగా సాగుతోందో లేదో పరిశీలిస్తూ అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైతులు కూడా అక్కడికి చేరుకుని పరిస్థితిని గమనించారు. పంటలకు తగినంత నీరు అందుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు.

ఈ పరిణామంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను త్వరగా పరిష్కరించినందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచారని పేర్కొన్నారు. పంటలు ఎండిపోతున్న సమయంలో నీరు అందించడం తమకు ప్రాణాధారం లాంటిదని అన్నారు.

ఇటీవల వాతావరణ మార్పులు, తక్కువ వర్షపాతం వంటి కారణాల వల్ల సాగునీటి సమస్యలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కాలువల ద్వారా నీటి సరఫరా కీలకంగా మారింది. అలాంటి పరిస్థితుల్లో కొన్ని ప్రాంతాలకు నీరు అందకపోవడం రైతులకు పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను త్వరగా గుర్తించి పరిష్కరించడం వ్యవసాయ రంగానికి ఊరట కలిగించే అంశంగా భావిస్తున్నారు.

ఈ ఘటనతో మరోసారి సాగునీటి పంపిణీలో సమన్వయం అవసరమనే అంశం వెలుగులోకి వచ్చింది. అన్ని ప్రాంతాలకు సమానంగా నీరు అందేలా అధికారులు పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. కాలువల నిర్వహణ, నీటి పంపిణీ విధానం మరింత సమర్థవంతంగా ఉండాలని అభిప్రాయపడుతున్నారు.

మొత్తంగా చూస్తే, రైతుల సమస్యపై తక్షణ స్పందన, నీటి విడుదల చర్యలు సాగునీటి నిర్వహణలో వేగం పెరిగిందనే సంకేతాన్ని ఇస్తున్నాయి. అయితే ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించడం కూడా అంతే ముఖ్యమని విశ్లేషకులు భావిస్తున్నారు. రాబోయే కాలంలో సాగునీటి వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందా అనే అంశంపై రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



## కాళేశ్వరం పున: వినియోగం హర్షనీయం

**మొదటిపేజీ తరువాయి**



పంటలు ఎండిపోయాయని ఆమె ఆరోపించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన కవిత, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ, నగర అభివృద్ధి, మున్సిపల్ పాలన, ఫ్యూచర్ సిటీ అంశాలపై విస్తృతంగా స్పందించారు.

ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును మళ్లీ వినియోగంలోకి తేవాలని నిర్ణయించడం సరైన చర్యేనని కవిత పేర్కొన్నారు. అయితే ఈ నిర్ణయం ఆలస్యంగా తీసుకోవడం వల్ల రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నీటిని సమర్థవంతంగా వినియోగించకుండా, నిర్వహణలో నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యవసాయ రంగం తీవ్రంగా ప్రభావితమైందని ఆమె ఆరోపించారు. నీటి లభ్యత ఉన్నప్పటికీ సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల పంటలకు నీరందక ఎండిపోయిన పరిస్థితులు ఏర్పడ్డాయని వ్యాఖ్యానించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల పేరుతో ఇప్పుడు ప్రభుత్వం చర్యలు చేపడుతుండటంపై కూడా కవిత విమర్శలు చేశారు. ఈ మరమ్మతుల వెనుక కమీషన్ల కోణం ఉందని ఆమె ఆరోపించారు. ప్రజా ప్రయోజనాలకన్నా ఆర్థిక ప్రయోజనాలే ప్రధానంగా కనిపిస్తున్నాయని, ఇదే కారణంగా ప్రాజెక్టు నిర్వహణపై అనుమానాలు పెరుగుతున్నాయని అన్నారు. పెద్ద ఎత్తున ప్రజాధనం ఖర్చు చేసే ప్రతి పనిలో పారదర్శకత అవసరమని ఆమె స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని మున్సిపల్ వ్యవస్థ, అర్బన్ ఫారెస్ట్రీ విభాగాల్లో కూడా తీవ్రమైన అవినీతి చోటుచేసుకుంటోందని కవిత ఆరోపించారు. పట్టణాభివృద్ధి పేరిట జరుగుతున్న పనుల్లో నాణ్యత లోపం, నిధుల దుర్వినియోగం వంటి సమస్యలు కనిపిస్తున్నాయని అన్నారు. నగరాభివృద్ధి కార్యక్రమాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండాల్సిన అవసరం ఉందని, కానీ ప్రస్తుతం అవి రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకే పరిమితమవుతున్నాయని ఆమె విమర్శించారు.

హైదరాబాద్ అభివృద్ధి పేరుతో తీసుకువస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై కూడా కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం ఈ ప్రాజెక్టును ఉపయోగించకూడదని, ఇది నగరానికి దీర్ఘకాలంలో నష్టం కలిగించే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. నగర విస్తరణ, కొత్త ప్రాజెక్టులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేలా ఉండాలని, కానీ భూముల వ్యాపారానికి మాత్రమే పరిమితం కాకూడదని అభిప్రాయపడ్డారు.

ప్రాజెక్టుల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం వల్ల ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని కవిత వ్యాఖ్యానించారు. ముఖ్యంగా భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ప్రజల పన్ను డబ్బుతోనే నడుస్తున్నందున వాటిపై పూర్తి స్థాయి జవాబుదారీతనం అవసరమని ఆమె అన్నారు. నిర్ణయాలు తీసుకునే ముందు విస్తృతమైన సమీక్షలు జరగాలని, అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వ్యవసాయానికి జీవనాడిగా ఉండాల్సిన ప్రాజెక్టు అని కవిత గుర్తుచేశారు. అలాంటి ప్రాజెక్టు నిర్వహణలో లోపాలు జరిగితే దాని ప్రభావం నేరుగా రైతులపై పడుతుందని అన్నారు. గతంలో ప్రాజెక్టు ద్వారా నీటిని సకాలంలో అందించలేకపోవడం వల్ల అనేక జిల్లాల్లో పంటలు నష్టపోయిన ఘటనలను ఆమె ప్రస్తావించారు. ఈ పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

అలాగే, ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని కవిత అన్నారు. కేవలం పనులు ప్రారంభించడం కాకుండా వాటి అమలు, పర్యవేక్షణ, ఫలితాలపై స్పష్టమైన బాధ్యత వ్యవస్థ ఉండాలని చెప్పారు. లేకపోతే ప్రజాధనం వృథా అవుతుందని, ప్రాజెక్టు లక్ష్యం నెరవేరదని హెచ్చరించారు.


హైదరాబాద్ నగర అభివృద్ధి విషయంలో కూడా సమతుల్యత అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఒకవైపు మౌలిక వసతుల అభివృద్ధి అవసరమైనప్పటికీ, మరోవైపు పర్యావరణ పరిరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలపై దృష్టి పెట్టాలని సూచించారు. అర్బన్ ఫారెస్ట్రీ పేరుతో జరుగుతున్న పనులు నిజమైన పర్యావరణ రక్షణకు దోహదపడాలే తప్ప, కేవలం ప్రాజెక్టు వ్యయాల పెంపు కోసం కాకూడదని అన్నారు.

ఫ్యూచర్ సిటీ వంటి భారీ ప్రాజెక్టులపై నిర్ణయాలు తీసుకునే ముందు సమగ్ర ప్రణాళిక అవసరమని కవిత చెప్పారు. భూముల విలువల పెంపు లేదా రియల్ ఎస్టేట్ అభివృద్ధి మాత్రమే లక్ష్యంగా ఉంటే అది నగరానికి దీర్ఘకాలికంగా హానికరమవుతుందని హెచ్చరించారు. నగర అభివృద్ధి అనేది సమగ్ర దృక్పథంతో జరగాలని, ప్రజల ప్రయోజనాలు కేంద్రంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు.

మొత్తంగా, కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం, మరమ్మతులు, మున్సిపల్ పాలన, అర్బన్ ఫారెస్ట్రీ, ఫ్యూచర్ సిటీ అంశాలపై కవిత చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల్లో పారదర్శకత, బాధ్యత, ప్రజా ప్రయోజనం ప్రధానంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రజాధనం వినియోగించే ప్రతి ప్రాజెక్టులో సమర్థవంతమైన పర్యవేక్షణ వ్యవస్థ అవసరమని పునరుద్ఘాటించారు.

## సెమీకండక్టర్లలో స్వావలంబన!

**మొదటిపేజీ తరువాయి**



ఈ కొత్త పాలసీ దోహదపడుతుందని, కేంద్రం అమలు చేస్తున్న ఈఎంసీ, ఐఎస్ఎం పథకాల ద్వారా రాష్ట్రానికి ప్రయోజనం కలిగేలా ఉంటుందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. ఈ పాలసీ రూపకల్పనకు సంబంధిత రంగాలకు చెందిన ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే కొత్త పాలసీ విడుదల చేస్తామని పరిశ్రమల శాఖ వర్గాలు చెప్తున్నాయి.

**ఫ్యూచర్ సిటీలో కొత్త ఈఎంసీ**

పాలసీలో భాగంగా ప్రధానంగా కొత్త ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు (ఈఎంసీ), నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తారు. హైదరాబాద్‌లో 'సెమీకండక్టర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ద్వారా ప్రతీ ఏటా ఐదు వేల మందికి నైపుణ్య శిక్షణ ఇస్తారు. చిప్ డిజైన్, కృత్రిమ మేధస్సు (ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల్లో ఈ శిక్షణ ఉంటుంది.

కొత్త పాలసీలో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీలో కొత్త ఈఎంసీ ఏర్పాటుకు అనువైన 623 ఎకరాలను ఇప్పటికే గుర్తించినట్లు సమాచారం. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ అమలు చేస్తున్న ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ 2.0 పథకం కింద ఏర్పాటయ్యే ఈఎంసీ ద్వారా తెలంగాణలో కొత్త తరం ఎలక్ట్రానిక్స్ తయారీకి అవసరమైన పునాది ఏర్పడుతుందని పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) వర్గాలు చెప్తున్నాయి.

**ఈఎంసీల అభివృద్ధిపై దృష్టి**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ మొదటి దశ (ఈఎంసీ 1.0) లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం టీజీఐఐసీ ద్వారా ఇప్పటికే రెండు ఈఎంసీల అభివృద్ధిని ప్రతిపాదించింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 310 ఎకరాల్లో రూ.437 కోట్ల వ్యయంతో ఒక ప్రాజెక్టును ప్రతిపాదించింది. ఇందుకు కేంద్రం రూ.138.60 కోట్లు గ్రాంటు రూపంలో ఇవ్వనుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.298 కోట్లు వెచ్చించనుంది.

మహేశ్వరం మండలం రావిర్యాలలోనూ 603 ఎకరాల్లో రాష్ట్రం ఈఎంసీని అభివృద్ధి చేస్తోంది. మొత్తం రూ.667 కోట్ల వ్యయం అంచనా వేయగా కేంద్రం రూ.252.41 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.415 కోట్లు వెచ్చించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత బడ్జెట్‌లో రాష్ట్ర వాటాగా రూ.19.70 కోట్లు మంజూరు చేశారు. ఇదిలా ఉంటే మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి (తాడిపర్తి) వద్ద ఈఎంసీ 2.0లో భాగంగా రూ.878 కోట్లవ్యయంతో కొత్త ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్ ఏర్పాటుకు టీజీఐఐసీ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది.

## వడూర్ గ్రామ పంచాయతీలో చలివేంద్రం ప్రారంభం

**బోథ్, ఏప్రిల్ 10-డిడి 9వార్త) :**

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ అడేపు శ్రీకాంత్ మరియు పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి (సెక్రటరీ) సద్దాం రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో బాటసారులకు, గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, వార్డు సభ్యులు లక్ష్మణ్, సురేష్, గ్రామస్తులు వీరన్న, ప్రశాంత్ మరియు ఇతర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# నోట్ల కట్టల ఆరోపణలు.. న్యాయమూర్తి రాజీనామా

**మొదటిపేజీ తరువాయి**



వెలుగులోకి వచ్చిన నగదు కట్టల వివాదం, అనంతరం ప్రారంభమైన అభిశంసన ప్రక్రియ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. తన రాజీనామా లేఖను ఆయన నేరుగా ద్రౌపదీ ముర్ముకు పంపినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

**వివాదం ఎలా ప్రారంభమైంది?**

ఈ వివాదానికి మూల కారణం ఆయన Delhi High Courtలో న్యాయమూర్తిగా పనిచేస్తున్న సమయంలో జరిగిన ఒక ఘటన. అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం సంభవించగా, మంటలను ఆర్పేందుకు వచ్చిన అగ్నిమాపక సిబ్బంది కాలిపోయిన నగదు కట్టలను గుర్తించారు. ఈ ఘటనతో న్యాయ వ్యవస్థలో సంచలనం నెలకొంది. సాధారణంగా న్యాయమూర్తులపై ఇలాంటి ఆరోపణలు అరుదుగా వస్తుండటంతో ఈ విషయం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది.

సుప్రీంకోర్టు స్పందన – అంతర్గత విచారణ

ఈ ఘటనపై వెంటనే స్పందించిన అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా అంతర్గత విచారణకు ఆదేశించారు. ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టారు. ఆ కమిటీ నివేదికలో అగ్నిప్రమాదం జరిగిన సమయంలో నగదు కట్టలు ఉన్నట్లు తేల్చింది. అయితే ఆ నగదు ఎవరిది? ఎలా అక్కడికి చేరింది? అనే అంశాలపై స్పష్టత రాలేదు.

కమిటీ నివేదిక వెలువడిన అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ వర్మను రాజీనామా చేయాలని సూచించినట్లు సమాచారం. అయితే ఆయన ఆ సూచనను తిరస్కరించారు. తనపై వచ్చిన ఆరోపణలు ఆధారరహితమని పేర్కొన్నారు.

జస్టిస్ వర్మ వాదన

తనపై వచ్చిన ఆరోపణలను జస్టిస్ యశ్వంత్ వర్మ తీవ్రంగా ఖండించారు. తాను గానీ, తన కుటుంబ సభ్యులు గానీ ఇంట్లో నగదు నిల్వ ఉంచలేదని ఆయన స్పష్టం చేశారు. ఆ నగదు స్టోర్‌రూమ్‌లో ఉన్నట్లు చెబుతున్నప్పటికీ, ఆ గది అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఉందని, ఎవరైనా అక్కడికి చేరుకోవచ్చని ఆయన వాదించారు.

అంతేకాకుండా విచారణ కమిటీ నివేదికను సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కమిటీ తనపై చేసిన నిర్ధారణలు తప్పని పేర్కొంటూ న్యాయపరమైన పోరాటం ప్రారంభించారు. అయితే సుప్రీంకోర్టు ఆయన పిటిషన్‌ను తిరస్కరించడం ఆయనకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

అభిశంసన ప్రక్రియ – రాజకీయ, న్యాయ పరిణామాలు

జస్టిస్ వర్మపై ఆరోపణలు తీవ్రమవడంతో ఆయనను పదవి నుంచి తొలగించేందుకు అభిశంసన ప్రక్రియ ప్రారంభమైంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీలకు లేఖలు రాశారు. ఇందులో జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు, విచారణ కమిటీ నివేదిక వివరాలు ప్రస్తావించినట్లు తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో పార్లమెంటు ఉభయ సభల్లోనూ అభిశంసన తీర్మానం తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఎంపీలు ఈ అంశాన్ని గంభీరంగా తీసుకుని, న్యాయవ్యవస్థ విశ్వసనీయత దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

రాజీనామా – అభిశంసనకు ముగింపు?

ఈ పరిణామాల మధ్య జస్టిస్ వర్మ అకస్మాత్తుగా రాజీనామా చేయడం కీలక మలుపుగా మారింది. రాజీనామా అనంతరం అభిశంసన ప్రక్రియ కొనసాగించాల్సిన అవసరం ఉండదని లోక్‌సభ సెక్రటేరియట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సాధారణంగా పదవిలో ఉన్న న్యాయమూర్తులపై మాత్రమే అభిశంసన ప్రక్రియ అమలులో ఉంటుంది. ఒకవేళ వ్యక్తి ముందుగానే రాజీనామా చేస్తే, ఆ ప్రక్రియ ఆటోమేటిక్‌గా ముగిసే అవకాశం ఉంటుంది.

న్యాయవ్యవస్థపై ప్రభావం

ఈ మొత్తం వ్యవహారం భారత న్యాయవ్యవస్థపై కూడా ప్రభావం చూపింది. న్యాయమూర్తులపై పారదర్శకత, బాధ్యత వంటి అంశాలు మళ్లీ చర్చకు వచ్చాయి. ఒక న్యాయమూర్తి నివాసంలో నగదు కట్టలు బయటపడటం వంటి ఆరోపణలు ప్రజల్లో అనుమానాలు రేకెత్తించాయి.

అయితే విచారణ, న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగడం ద్వారా వ్యవస్థ తనదైన విధంగా స్పందించిందని నిపుణులు భావిస్తున్నారు. సుప్రీంకోర్టు తక్షణ చర్యలు తీసుకోవడం, విచారణ కమిటీ ఏర్పాటు చేయడం వంటి చర్యలు వ్యవస్థలోని నియంత్రణ విధానాలను ప్రతిబింబించాయి.

**రాజకీయ, సామాజిక ప్రతిస్పందన**

ఈ ఘటనపై రాజకీయ వర్గాలు కూడా విభిన్నంగా స్పందించాయి. కొందరు న్యాయవ్యవస్థపై మరింత కఠిన నియంత్రణ అవసరమని అభిప్రాయపడగా, మరికొందరు ఇది వ్యక్తిగత స్థాయిలో జరిగిన ఘటనగా మాత్రమే చూడాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో కూడా ఈ అంశంపై విస్తృత చర్చ జరిగింది.

మొత్తానికి జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా దేశ న్యాయ చరిత్రలో ఒక ముఖ్యమైన సంఘటనగా నిలిచే అవకాశం ఉంది. నగదు కట్టల వివాదం నుంచి ప్రారంభమైన ఈ పరిణామాలు చివరకు రాజీనామాతో ముగియడం గమనార్హం. అభిశంసన ప్రక్రియ ప్రారంభ దశలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం వల్ల ఆ ప్రక్రియ నిలిచిపోయే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు న్యాయవ్యవస్థలో మరింత పారదర్శకత, బాధ్యత అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో, న్యాయమూర్తుల ప్రతిష్ఠను కాపాడే విధంగా సరైన విచారణా విధానాలు కూడా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

# మరో 42 మంది మావోయిస్టులు సరెండర్

**మొదటిపేజీ తరువాయి**

క్షీణిస్తున్నాయనే సంకేతంగా భావిస్తున్నారు. లొంగిపోయిన వారిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ స్థాయి నాయకుడు కేశాలు ఉండటం ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ స్థాయి నాయకులు లొంగిపోవడం ద్వారా మావోయిస్టు నిర్మాణంపై ప్రభావం పడుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, మావోయిస్టు సిద్ధాంతంపై విశ్వాసం తగ్గడం, భద్రతా దళాల కూంబింగ్ చర్యలు పెరగడం వల్లే లొంగుబాట్లు అధికమయ్యాయని వివరించారు.

ప్రత్యేకంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో భద్రతా బలగాలు చేపడుతున్న కూంబింగ్ చర్యలు తీవ్రరూపం దాల్చడంతో అక్కడి మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. లొంగిపోయిన వారిలో ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే ఉన్నారని, తెలంగాణకు చెందిన వారు చాలా తక్కువ మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఇది తెలంగాణలో మావోయిస్టు ప్రభావం గణనీయంగా తగ్గిందనే అంశాన్ని స్పష్టం చేస్తోందని అన్నారు.

లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం పునరావాస ప్యాకేజీ కింద సమగ్ర సహాయం అందిస్తున్నట్లు డీజీపీ వివరించారు. మొత్తం రూ.1.93 కోట్ల మేర ఆర్థిక సహాయం అందజేస్తున్నామని తెలిపారు. ఈ సహాయం ద్వారా వారు తిరిగి సాధారణ జీవితంలోకి అడుగుపెట్టేందుకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. అదనంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆరోగ్య కార్డులు కూడా అందజేస్తున్నామని చెప్పారు. ఇది వారి కుటుంబాలకు వైద్య భద్రతను కల్పించే దిశగా కీలక చర్యగా భావిస్తున్నారు.

మావోయిస్టు నిర్మాణంలో తెలంగాణకు చెందిన నాయకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని డీజీపీ వెల్లడించారు. గతంలో సెంట్రల్ కమిటీలో తెలంగాణకు చెందిన 11 మంది ఉండగా, ప్రస్తుతం ఇద్దరే మిగిలి ఉన్నారని తెలిపారు. అలాగే స్టేట్ కమిటీలో ఒకప్పుడు 24 మంది తెలంగాణకు చెందినవారు ఉండగా, ఇప్పుడు ఇద్దరే ఉన్నారని చెప్పారు. ఇది రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావం తగ్గుముఖం పట్టిందనే స్పష్టమైన సూచనగా ఆయన అభివర్ణించారు.

ఇప్పటికీ అడవుల్లో ఉన్న మావోయిస్టులు కూడా



లొంగిపోవాలని డీజీపీ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పునరావాస పథకాలను వినియోగించుకుని సమాజంలో తిరిగి కలవాలని సూచించారు. ఆయుధాలు వదిలి సాధారణ జీవితం వైపు మళ్లితే ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. మావోయిస్టు మార్గం సమస్యలకు పరిష్కారం కాదని, అభివృద్ధి, శాంతి మార్గాలే ప్రజలకు మేలు చేస్తాయని ఆయన పేర్కొన్నారు.

ఈ పరిణామం నేపథ్యంలో భద్రతా బలగాల పాత్రపై కూడా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. క్రమం తప్పకుండా కూంబింగ్ చర్యలు చేపట్టడం, సమాచారం సేకరణను మెరుగుపరచడం, ప్రజలతో అనుబంధాన్ని పెంపొందించడం వంటి చర్యల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని అధికారులు భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కూడా లొంగుబాట్లకు దోహదపడిందని పేర్కొంటున్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

- **పెండింగ్‌లో ఉన్న డీఏ పెంపు**
- **2.1 శాతం పెంచుతున్నట్టు ప్రకటించిన ప్రభుత్వం**
- **జనవరి 2026 నుంచి కొత్త డీఏ అమల్లోకి**
- **ఆర్టీసీ మీద నెలకు 2.82 కోట్ల అదనపు భారం**
- **ప్రభుత్వ నిర్ణయంతో ఆర్టీసీ ఉద్యోగుల హర్షం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర రవాణా సంస్థ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. ఉద్యోగుల చాలా కాలంగా ఉన్న డీఏ పెంపు డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారికంగా ప్రకటన చేశారు. 2026 క్యాలెండర్ సంవత్సరం నుంచి డీఏను 2.1 శాతం పెంచుతున్నట్లు వెల్లడించారు. దీంతో ఇప్పటి వరకు అమల్లో ఉన్న 50.7 శాతం డీఏను 52.8 శాతానికి పెంచినట్లు తెలిపారు.

ఈ నిర్ణయం రాష్ట్ర ఆర్టీసీ ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపింది. పెరిగిన డీఏ 2026 జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి రానుంది. అయితే, జనవరి నుంచి అమలులోకి వచ్చినప్పటికీ ఇప్పటి వరకు చెల్లించని మూడు నెలల డీఏ బకాయిలను ప్రభుత్వం ప్రత్యేకంగా చెల్లించనుంది. ఈ బకాయిలను సప్లిమెంటరీ బిల్లుల రూపంలో, ఒక్కో నెలకు విడతల వారీగా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు.

డీఏ పెంపు అంశం గత కొంతకాలంగా ఉద్యోగ సంఘాలు ప్రస్తావిస్తూ వస్తున్నాయి. పెరుగుతున్న ధరల భారాన్ని దృష్టిలో ఉంచుకుని, జీవన వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో డీఏను పెంచాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ఉద్యోగులకు ఆర్థికంగా కొంత ఉపశమనం కలిగించనుంది. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఉద్యోగులకు ఇది ఉపకారం అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

డీఏ అనేది ఉద్యోగుల వేతనంలో కీలక భాగం. ధరల పెరుగుదల ప్రభావాన్ని సమతుల్యం చేయడానికి ప్రభుత్వం కాలానుగుణంగా డీఏను పెంచుతూ ఉంటుంది. ఆర్థిక పరిస్థితులను, ద్రవ్యోల్బణ స్థాయిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయాలు తీసుకుంటారు. ఈ నేపథ్యంలో 2.1 శాతం పెంపు కూడా ఉద్యోగులపై ఉన్న ఆర్థిక ఒత్తిడిని కొంతవరకు తగ్గించే అవకాశం ఉంది. అయితే, ఈ డీఏ పెంపు నిర్ణయం ఆర్టీసీ సంస్థపై అదనపు ఆర్థిక భారం కూడా మోపనుంది. ఈ పెంపు కారణంగా ప్రతి నెలా సుమారు రూ.2.82 కోట్ల అదనపు వ్యయం భరించాల్సి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సాగుతున్న ఆర్టీసీకి ఇది ఒక సవాల్‌గా మారే అవకాశం ఉన్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగ




సంఘాల నుంచి సానుకూల స్పందనను పొందుతోంది. ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యగా దీనిని అభినందిస్తున్నారు. అయితే, ఇంకా కొన్ని సమస్యలు పరిష్కరించాల్సి ఉన్నాయని, భవిష్యత్తులో కూడా ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై ఇదే విధంగా స్పందించాలని సంఘాలు కోరుతున్నాయి.

ఇక సంస్థ పరంగా చూస్తే, డీఏ పెంపుతో పాటు ఆర్థిక నిర్వహణలో సమతుల్యత సాధించడం ఒక పెద్ద సవాల్‌గా మారనుంది. ఆదాయం పెంపు, ఖర్చుల నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. లేకపోతే, ఈ అదనపు భారం సంస్థపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, సంస్థ అధికారులు సమగ్ర ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

ఇటీవలి కాలంలో ఆర్టీసీ సంస్థల పరిస్థితి దేశవ్యాప్తంగా కూడా సవాళ్లతో నిండినదే. పెరుగుతున్న ఇంధన ధరలు, నిర్వహణ వ్యయాలు, ప్రయాణికుల సంఖ్యలో మార్పులు వంటి అంశాలు సంస్థల ఆర్థిక స్థితిపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగుల సంక్షేమం, సంస్థ ఆర్థిక స్థిరత్వం అనే రెండు అంశాలను సమతుల్యం చేయడం ప్రభుత్వానికి ఒక పెద్ద పరీక్షగా మారింది.

మరోవైపు, ఈ నిర్ణయం ప్రభుత్వంపై ఉద్యోగుల్లో విశ్వాసాన్ని పెంచే అవకాశముంది. ఉద్యోగుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామనే సందేశాన్ని ప్రభుత్వం ఇవ్వగలిగింది. ఇది భవిష్యత్తులో ఉద్యోగుల పనితీరుపై కూడా సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

మొత్తంగా చూస్తే, డీఏ పెంపు నిర్ణయం ఉద్యోగులకు ఆర్థిక ఉపశమనం కలిగించడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగ సంక్షేమ విధానాలపై ఒక స్పష్టమైన సంకేతాన్ని ఇస్తోంది. అయితే, దీని వల్ల ఏర్పడే ఆర్థిక భారాన్ని సమర్థవంతంగా నిర్వహించడం కూడా అంతే ముఖ్యమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో ఈ నిర్ణయం సంస్థపై ఎలా ప్రభావం చూపుతుందో చూడాలి.

# వేదిక్ మాథ్స్, అబాకస్‌తో గణిత భయానికి చెక్



**కోటగిరి, ఏప్రిల్ 10(డిడి9 వార్త):**

కోటగిరి మండల కేంద్రంలో నిర్వహించిన అబాకస్, వేదిక్ మాథ్స్ ప్రతిభా పోటీలు విద్యార్థుల్లో గణితంపై ఉన్న భయాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తాసిల్దార్ గంగాధర్ తెలిపారు. శుక్రవారం ఏఎస్ ఫంక్షన్ హాల్‌లో హైదరాబాద్ ఎంటిఎస్ అబాకస్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎలాంటి పరికరాలు లేకుండా విద్యార్థులు వేగంగా గణిత సమస్యలను పరిష్కరించడం అభినందనీయమని అన్నారు. వేదిక్ మాథ్స్, అబాకస్ పద్ధతులు భవిష్యత్తులో విద్యార్థుల ఆలోచనా శక్తి, లెక్కింపు సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ప్రతిభా పరీక్షలు నిర్వహించడం గర్వకారణమని, పట్టణాల్లో అధిక ఖర్చుతో అందుబాటులో ఉన్న శిక్షణను గ్రామీణ విద్యార్థులకు అందించడం ప్రశంసనీయం అని అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో బోధన్ విజ్ఞాన్ నవోదయ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు వివేక్, శ్రీ వేద హై స్కూల్ కరస్పాండెంట్ రవికుమార్, ప్రిన్సిపాల్ అక్షర, ఉపాధ్యాయులు రేష్మ, నఫీజ్, చంద్రకళ, సాయి పవన్, రమేష్, నాగరాజు, సంగీత, సునీత, అలాగే అబాకస్ వేదిక్ మాథ్స్ ఉపాధ్యాయులు భరత్, సుప్రియ, రమ్య తదితరులు పాల్గొన్నారు.





# యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**


**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 10 (డీడీ9 వార్త) :**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అధినేత మోహన్ భాగవత్ రాకను పురస్కరించుకుని కందకుర్తిలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో యంత్రాంగం చేపట్టిన సన్నాహక పనులను స్వయంగా పర్యవేక్షించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామంలోని భద్రతా ఏర్పాట్లు, బస సౌకర్యాలు మరియు రహదారుల స్థితిగతులను కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పర్యటన ప్రశాంతంగా, దిగ్విజయంగా ముగిసేలా ప్రతి విభాగం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ, ప్రజా పనుల శాఖల మధ్య సమన్వయం లోపించకూడదని కలెక్టర్ హెచ్చరించారు. భద్రతా పరమైన అంశాలపై ఏసీపీకి, మౌలిక వసతుల కల్పనపై ఇంజనీరింగ్ అధికారులకు కీలక సూచనలు చేశారు. అన్ని పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం తరపున ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సందర్శనలో కలెక్టర్ తో పాటు బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, రెంజల్ తహసీల్దార్, ఆర్ & బి శాఖ అధికారులు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి సహకార భరోసా

**బోధన్, ఏప్రిల్ 10 (డీడీ9 వార్త) :**



విద్యుత్ షాక్‌తో మరణించిన రైతు కుటుంబానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అండగా నిలిచింది. ఖండ్గావ్ గ్రామానికి చెందిన రైతు మీసాలే ముకుంద్ ఇటీవల కరెంటు షాక్ తగిలి దురదృష్టవశాత్తు మరణించారు. ఆయన మృతితో పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ, కల్దుర్కి సహకార సంఘం ద్వారా మంజూరైన జెపిఏ ఇన్సూరెన్స్ క్లెయిమ్ మొత్తాన్ని అందజేశారు. ముకుంద్ భార్య మీసాలే రమాబాయికి రూ. 2 లక్షల బీమా చెక్కును సంఘ కార్యదర్శి, బ్యాంకు అధికారులు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కష్టాల్లో ఉన్న రైతు కుటుంబాన్ని ఆదుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. సకాలంలో పంట రుణాలను రెన్యువల్ చేసుకున్న రైతులకు ప్రభుత్వం, సహకార సంఘాల ద్వారా రూ. 2 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సౌకర్యం ముకుంద్ కుటుంబానికి ఎంతో ఆసరాగా నిలిచిందని తెలిపారు. సంఘ పరిధిలోని రైతులందరూ ఈ అవకాశాన్ని గమనించి, తమ పంట రుణాలను గడువులోగా రెన్యువల్ చేసుకోవాలని, తద్వారా బీమా రక్షణ పొందవచ్చని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ కార్యదర్శి శ్రీనివాస్ చారి, బ్యాంకు మేనేజర్ సంతోష్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల్లో పారదర్శకతకే 'ఎన్ ఎం ఎం ఎస్ ' శిక్షణ





**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : డిడి 9 వార్త న్యూస్**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో మరింత జవాబుదారీతనం, పారదర్శకత పెంచడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన *NMMS (National Mobile Monitoring System)* యాప్ వినియోగంపై అటెండెంట్లు (మేట్లు) టెక్నిల్ అసిస్టెంట్ లు మరియు ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.డిజిటల్ హాజరుపై అవగాహన ఇచ్చోడా మండలం లోని స్థానిక రైతు వేదిక భవనం లో కార్యక్రమన్ని నిర్వహించడం జరిగింది ఈ ఒరియంటేషన్ ప్రోగ్రాంలో అధికారులు మాట్లాడుతూ, ఇకపై ఉపాధి పనుల వద్ద మాన్యువల్ హాజరుకు స్వస్తి పలికి, కేవలం ఎన్. ఎం ఎం ఎస్ యాప్ ద్వారా మాత్రమే హాజరు నమోదు చేయాలని స్పష్టం చేశారు. పని ప్రదేశంలో కూలీలు పని చేస్తున్నప్పుడు ఉదయం ఒకసారి, మధ్యాహ్నం ఒకసారి గ్రూపు ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయడంపై డెమో ఇచ్చారు. పనులు జరుగుతున్న ప్రదేశం యొక్క ఖచ్చితమైన లొకేషన్ నమోదు చేయడం తప్పనిసరి అని వివరించారు. సాంకేతిక సమస్యల పరిష్కారం లో భాగంగా సర్వర్ డౌన్ ఉన్నప్పుడు లేదా నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో డేటాను ఎలా సేవ్ చేయాలి అనే అంశాలపై అటెండెంట్లకు అవగాహన కల్పించారు.ఎలాంటి అవకతవకలు జరగకుండా, నిజమైన కూలీలకు మాత్రమే వేతనాలు అందేలా చూడటంలో పాత్రను వివరించారు. ఈ సందర్భంగా అదనపు డి ఆర్ డి మాట్లాడుతూ.. "ఎన్. ఎం. ఎం ఎస్ ద్వారా హాజరు నమోదు చేయకపోతే ఆ రోజు కూలీలకు వేతనాలు చెల్లించడం సాధ్యం కాదు. కాబట్టి ప్రతి అటెండెంట్ స్మార్ట్ ఫోన్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. ఫొటోలు తీసేటప్పుడు అందరూ స్పష్టంగా కనిపించేలా జాగ్రత్త పడాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు మరియు మండల పరిధి లోని ఉపాధి హామీ అటెండెంట్లు పాల్గొన్నారు. శిక్షణ అనంతరం అటెండెంట్లు తమ సందేహాలను అధికారుల ద్వారా నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమం లో ఏ. ఓ లు, డి టి సి, డి ఆర్ పి, సి ఎఫ్ ఎల్ ర్ సి, ఏ పి ఓ, ఇ సి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాస్త్రవేత్తగా రాణిస్తున్న రైతు బిడ్డ

**బోథ్, ఏప్రిల్ 10-డిడి 9వార్త)**





ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌట బి గ్రామానికి చెందిన డాక్టర్ లంకటి మహేష్ ప్రస్తుతం కరీంనగర్ జిల్లా జమ్మికుంట కృషి విజ్ఞాన్ కేంద్రం (కేవికే) లో వ్యవసాయ విస్తరణ విభాగ శాస్త్రవేత్త గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వ్యవసాయ విస్తరణ విభాగ శాస్త్రవేత్త గా ఆయన దేశ వ్యాప్తంగా వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తున్నాడు. రైతులు, గ్రామీణ యువత, విస్తరణ కార్మికులకు కేవికేలో వివిధ శిక్షణా కార్యక్రమాల ద్వారా సూచనలను సలహాలను అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన కేవికే ద్వారా అందిస్తున్న శిక్షణలు, ప్రభావ అధ్యయనాలపై విస్తృతంగా పని చేస్తున్నారు. ఇప్పటికే ఆయన పలు అంశాలపై రైతులకు 42 శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాడు. 1718 మంది ట్రైనీలకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు, వృత్తి శిక్షణా కార్యక్రమాలను చేపట్టాడు. భారత ప్రభుత్వం ద్వారా ప్రాయోజితం చేయబడిన ఎస్టీఆర్వై, ఏసీ & ఏ బీఎసీ, డీఏఈఎస్ఐ డీలర్స్ కి శిక్షణ ఇవ్వడం జరిగినది. డాక్టర్ మహేష్‌లంకటి ఇప్పటివరకు వ్యవసాయ రంగానికి సంబంధించి జాతీయ మరియు అంతర్జాతీయ జర్నల్స్ లో 22 వేర్వేరు పరిశోధనా పత్రాలు, 13 పుస్తక అధ్యాయాలను ప్రచురించారు . వివిధ వ్యవసాయ సమస్యలపై ప్రఖ్యాత పత్రికలలో 21 ప్రజాదరణ పొందిన వ్యాసాలను సైతం ప్రచురించారు. సొసైటీ ఆఫ్ కృషి విజ్ఞాన్, ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ అండ్ టెక్నాలజీ రీసెర్చ్ (ఐఎస్ఏఎస్టీఆర్) నోయిడా, అడ్వాన్సెస్ ఇన్ లైఫ్ సైన్స్ జర్నల్, ట్రెండ్స్ ఇన్ బయోసైన్సెస్ జర్నల్ లలో జీవితకాల సభ్యత్వం పొందారు. ఈయన అనేక జాతీయ మరియు అంతర్జాతీయ సమావేశాలలో పాల్గొన్నాడు, సుస్థిర అభివృద్ధిపై సారాంశాలు, పోస్టర్లను సమర్పించాడు. వ్యవసాయ రంగంలో ఈయన చేస్తున్న కృషికి గాను వివిధ విభాగాలలో నాలుగు అవార్డులను స్వీకరించారు. 2024 లో ఆయన రైతులకు చేసిన సేవలకు గాను ఉత్తమ కేవికే శాస్త్రవేత్త అవార్డును జిల్లా కలెక్టర్, ఐటీ మంత్రి చేతుల మీదుగా స్వీకరించాడు. 2024 లో ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ అండ్ టెక్నాలజీ రీసెర్చ్ (ఐఎస్ఏఎస్టీఆర్) నోయిడా జర్గిన కాన్ఫరెన్స్ లో ఆయన చేసిన పరిశోధనలకు గాను ఉత్తమ వ్యవసాయ విస్తరణ విభాగ శాస్త్రవేత్త అవార్డును స్వీకరించారు 2025 లో హన్రాజ్ వ్యవసాయ విశ్వ విధ్యాలయం వారు నిర్వహించిన రెండవ అంతర్జాతీయ సాధస్సులో ఆయన వ్యవసాయ విస్తరణ విభాగంలో చేసిన కృషి గాను ఉత్తమ నవీన శాస్త్రవేత్త అవార్డును స్వీకరించారు. 2026 లో మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన సుస్థిర వ్యవసాయ అభివృద్ధిలో పరిశోధన, ఆవిష్కరణలు & మహిళా సాధికారతపై 1వ అంతర్జాతీయ సదస్సు నందు గత ఐదేళ్ల నుండి కృషి విజ్ఞన కేంద్రం లో చేపట్టిన వివిధ కార్యక్రమాలకు గాను ఉత్తమ కేవికే శాస్త్రవేత్త అవార్డును స్వీకరించారు. డాక్టర్ మహేష్ ఆహార భద్రతను నిర్ధారించడానికి, జీవనోపాధిని మెరుగుపరచడానికి, సహజ వనరులను మెరుగ్గా నిర్వహించడానికి పర్యావరణాన్ని పరిరక్షించడానికి విశేష కృషి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన అభివృద్ధిని సాధించడానికి ఆయన అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు.

# ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి : తహసీల్దార్ దత్తాద్రి



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 10 (డీడీ9 వార్త) :**


రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన యాసంగి వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఎడపల్లి, జైతాపూర్ సహకార సంఘాల పర్సన్ ఇంచార్జ్ రమాదేవి, ఎడపల్లి తహసీల్దార్ దత్తాద్రి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎడపల్లి మండలంలోని జైతాపూర్, ఎడపల్లి గ్రామాల్లో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రేడ్ఏ ధాన్యానికి రూ. 2320లు, సాధారణ గ్రేడ్ ధాన్యానికి రూ.2300ల మద్దతు ధరను చెల్లిస్తుందని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చే ముందే తేమ శాతం 17 శాతం లోపు ఉండేలా జాగ్రత్త పడాలని సూచించారు. దళారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తక్కువ ధరలకే ధాన్యం కొనుగోలు చేసే ప్రమాదం ఉందని, అటువంటి వారిని నమ్మి నష్టపోవద్దని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన వారం రోజుల్లోపే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అధికారులు భరోసా ఇచ్చారు. ఎడపల్లి సహకార సంఘం పరిధిలోని ఎడపల్లి, మంగళ్పహాడ్, తానాకలాన్, కుర్నాపల్లి గ్రామాల్లోనూ, జైతాపూర్ సంఘం పరిధిలోని జైతాపూర్, జమలం, ఏ ఆర్ పి క్యాంప్, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కందగట్ల రామచందర్, నాగుల రాజు గౌడ్, ఉప సర్పంచులు మచ్చకూరి గంగాధర్, భార్గవ్, సహకార సంఘాల కార్యదర్శులు రాజారాం, సుభాష్, మాజీ అధ్యక్షులు పోల మల్కారెడ్డి, బోధన్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్, సిబ్బంది ప్రభాకర్ గౌడ్, సాయిలు, సురేష్, జగన్, రైతులు పాల్గొన్నారు.



# పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా 10 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

సాలూర మండలంలో గత వారం కురిసిన అకాల వడగండ్ల వాన వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులను ఆదుకోవాలని బిజెపి మండల అధ్యక్షులు రావుబా గంగాధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన రైతులతో కలిసి సాలూర ఎమ్మార్వో నవాజ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రావుబా గంగాధర్ మాట్లాడుతూ... మండలంలోని వివిధ గ్రామాలలో సాగు చేసిన వరి మరియు మొక్కజొన్న పంటలు కోతకు వచ్చే సమయంలో వడగండ్ల వాన ధాటికి పూర్తిగా నేలమట్టమై రైతులు కోలుకోలేని దెబ్బ తిన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్ల ముందే నాశనం కావడంతో రైతులు అప్పుల పాలయ్యే పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని కోరారు. ముఖ్యంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా పూర్తి స్థాయిలో మద్దతు ధర కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేసే వరకు అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు రాజు, నరేష్, లక్ష్మణ్ పటేల్, సంజు పటేల్, కాళిదాస్, గంగాధర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



# కందకుర్తిలో ఆర్ఎస్ఎస్ చీఫ్ పర్యటనబి: బందోబస్తు సిద్ధం

- **భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన సీపీ సాయి చైతన్య**
- **నేడు శ్రీ కేశవ స్ఫూర్తి మందిర్ ప్రారంభోత్సవం**



**బోధన్, నిజామాబాద్ జిల్లా 10 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

చారిత్రక పుణ్యక్షేత్రం కందకుర్తిలో ఆదివారం జరగనున్న శ్రీ కేశవ స్ఫూర్తి మందిర్ ప్రారంభోత్సవానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సరసంఘ్ చాలక్ డాక్టర్ మోహన్ రావు భగవత్ విచ్చేస్తున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట బందోబస్తును సిద్ధం చేసింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం కోసం జరుగుతున్న ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య శనివారం క్షుణ్ణంగా పర్యవేక్షించారు. మందిర ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టాపన మరియు బహిరంగ సభ నిర్వహించే ప్రదేశాలను ఆయన స్వయంగా సందర్శించి భద్రతా పరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... ప్రముఖుల రాకను పురస్కరించుకుని అన్నీ ప్రదేశాలలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సభా స్థలి వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాష్ట్ర స్థాయి బలగాలతో పాటు కేంద్ర పారా మిలటరీ బలగాలను కూడా రంగంలోకి దించినట్లు వెల్లడించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఆరు ప్రత్యేక క్యూఆర్టీ బృందాలను కేటాయించామని, సభా ప్రాంగణమంతా సీసీ కెమెరాల నిఘాలో ఉంటుందని ఆయన వివరించారు. ఈ మెగా ఈవెంట్ కోసం దాదాపు 400 మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు సీపీ స్పష్టం చేశారు. కార్యక్రమానికి విచ్చేసే భక్తులకు మరియు ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయబాబుతో పాటు రెంజల్, బోధన్ రూరల్, ఎడపల్లి ఎస్సైలు చంద్రమోహన్, మచ్చందర్ రెడ్డి, రమ పాల్గొన్నారు. కేశవనంద భారతి ట్రస్ట్ ప్రెసిడెంట్ చామకూరి సుధాకర్ రెడ్డి, తెలంగాణ సహ ప్రచారక్ శివ కుమార్, ట్రస్ట్ సభ్యులు మల్లికార్జున్, సుబోర్ కాకాని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఏర్పాట్లను వివరించారు.

# బూత్ స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే బి ఎల్ ఓ లక్ష్యం డిసిసి వైస్‌ప్రెసిడెంట్ బగునూరే. మాధవ్ రావ్ పటేల్.



**ఆదిలాబాద్ 10 మార్చ్ (డీడీ9 వార్త న్యూస్ ):**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయంలో శుక్రవారం రోజు అదిలాబాద్ జిల్లా కౌన్సిలర్ లతో డిసిసి వైస్ ప్రెసిడెంట్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ బగునూరి మాధవరావు పటేల్ బి ఎల్ ఓ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కౌన్సిలర్లు నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొగునూరి మాధవ రావు పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని ఆదిలాబాద్ జిల్లాలో బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందు కెళ్లాలని, రానున్న రోజులలో ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ జెండా ఎగరాలని, ప్రతి గ్రామంలో బూత్ స్థాయి ఏజెంట్లను ఎన్నుకొని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని అందరికీ అర్థమయ్యే విధంగా ప్రచారం చేయాలని. ప్రతి గ్రామానికి ఒక యువ నాయకున్ని తయారు చేయాలని ఆయన అన్నారు.ఈ సందర్భంలో మాధవ్ రావ్ పటేల్ తో పాటు సంజీవరెడ్డి మరియు అధికార నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నిజామాబాద్‌లో క్రీడల జోరు..
# సైబర్ భద్రతే లక్ష్యం




- **నేటి నుంచి జిల్లా స్థాయి క్రీడా పోటీల రిజిస్ట్రేషన్లు ప్రారంభం**
- **యువత లక్ష్యంగా నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ వినూత్న ప్రయోగం**
- **క్రికెట్ విజేతకు రూ. 1 లక్ష నగదు పురస్కారం.. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన కమిటీ**

**నిజామాబాద్ జిల్లా 10 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

ఇందూరు గడ్డపై క్రీడల కోలాహలం మొదలుకానుంది. జిల్లా యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడంతో పాటు, నేటి సమాజానికి అత్యంత అవసరమైన సామాజిక అంశాలపై అవగాహన కల్పించేందుకు నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ నడుం బిగించింది. నిజామాబాద్ పోలీస్ కమీషనర్ కార్యాలయ వేదికగా నిజామాబాద్ ప్రీమియర్ లీగ్ పేరుతో ప్రతిష్టాత్మక జిల్లా స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు రంగం సిద్ధమైంది. కేవలం ఆటలకే పరిమితం కాకుండా, పెరుగుతున్న సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన మరియు ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలకు, యువతకు విస్తృత అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఈ మెగా టోర్నమెంట్‌ను రూపొందించారు. ఎన్ఎస్‌సీ చైర్మన్ సాయి చైతన్య నేతృత్వంలో ఈ పోటీల నిర్వహణ అత్యంత పారదర్శకంగా జరిగేలా నిర్వాహక కమిటీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ బృహత్తర కార్యక్రమంలో ఎన్ఎస్‌సీ కన్వీనర్ బస్వ రెడ్డి, జనరల్ సెక్రటరీ కవిత రెడ్డి పర్యవేక్షణలో వివిధ విభాగాలకు జాయింట్ సెక్రటరీలుగా కే.శ్రీనివాస్ రెడ్డి (స్పోర్ట్స్), డాక్టర్ కే.శిరీష్ కుమార్ (సైబర్ సెక్యూరిటీ), రజినీకాంత్ (ఫిజికల్ సెక్యూరిటీ) మరియు ట్రెజరర్‌గా కే.సంతోష్ కుమార్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ బి.పవన్ కుమార్ మరియు కబడ్డీ కోచ్ ప్రశాంత్ ఈ టోర్నమెంట్‌కు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తూ ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు.

అయిదు రకాల క్రీడలు.. వేదికలు సిద్ధం:
ఈ మెగా టోర్నమెంట్‌లో మొత్తం ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. వాలీబాల్, బాస్కెట్ బాల్ మరియు కబడ్డీ పోటీలు నిజామాబాద్‌లోని డీఎస్‌ఏ మైదానంలో జరగనున్నాయి. కబడ్డీ పోటీలు కేవలం పురుషులకు మాత్రమే పరిమితం చేయగా, మిగిలిన విభాగాల్లో ఉత్సాహవంతులైన క్రీడాకారులందరూ పాల్గొనవచ్చు. ఇక యోగా పోటీలు సుభాష్ నగర్‌లోని కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ వేదికగా జరగనున్నాయి. బాలబాలికల వయస్సును బట్టి అండర్14, అండర్18 మరియు 18 ఏళ్లు పైబడిన వారికి విడివిడిగా మొత్తం 6 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. అత్యంత ఆకర్షణీయమైన క్రికెట్ పోటీలు కంటేశ్వర్‌లోని మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో 12 ఓవర్ల ఫార్మాట్‌లో, హార్డ్ టెన్నిస్ బాల్‌తో జరగనున్నాయి.


**భారీ బహుమతులు..**
**గెలుపు గుర్రాలకు లక్షలు:**
ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు నిర్వాహకులు భారీ నగదు బహుమతులను ప్రకటించారు. క్రికెట్ విజేత జట్టుకు ఏకంగా రూ.1 లక్ష, రన్నరప్‌కు రూ.50 వేల నగదు పురస్కారం అందజేయనున్నారు. వాలీబాల్, బాస్కెట్ బాల్ మరియు కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లకు రూ. 20 వేల, ద్వితీయ స్థానానికి రూ. 10 వేల, తృతీయ స్థానానికి రూ. 5 వేల చొప్పున బహుమతులు లభిస్తాయి. యోగా విభాగంలో గెలుపొందిన వారికి వరుసగా రూ.3, రూ.2 మరియు రూ.1 వెయ్యి నగదు బహుమతులు అందజేస్తారు.

రిజిస్ట్రేషన్ మరియు నిబంధనలు:
పోటీల్లో పాల్గొనాలనుకునే ఆసక్తి గల జిల్లా క్రీడాకారులు తమ పేర్లను ఏప్రిల్ 11 నుండి 17వ తేదీ సాయంత్రం 5:00 గంటల లోపు నమోదు చేసుకోవాలి. ఏప్రిల్ 18న మధ్యాహ్నం 2 గంటలకు పోటీలకు సంబంధించిన డ్రా ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ పోటీలు కేవలం నిజామాబాద్ జిల్లా నివాసులకు మాత్రమే కేటాయించినందున, క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డును జతపరచాలి. యోగా పోటీదారులు వయస్సు ధృవీకరణ కోసం స్కూల్ బోనఫైడ్ లేదా ఎస్ఎస్‌సీ మెమో సమర్పించాల్సి ఉంటుంది. క్రికెట్ క్రీడాకారులు తమ సొంత వైట్ ప్యాంట్, షూస్ ధరించాలని, నిర్వాహకుల తరపున టీషర్టులు మాత్రమే సరఫరా చేస్తారని కమిటీ స్పష్టం చేసింది. మరిన్ని వివరాల కోసం వాలీబాల్ ఇన్చార్జ్ బి.మల్లేష్ గౌడ్ 9440711635, బాస్కెట్ బాల్ ఇన్చార్జ్ బి.నరేష్ 9440404424, కబడ్డీ ఇన్చార్జ్ ఎం.ప్రశాంత్ 9866770889, యోగా బాధ్యులు సంగీత 9848420803 లేదా గంగాధర్ 8074982200, క్రికెట్ ఇన్చార్జిలు సురేష్‌కుమార్ 9849202586 లేదా విక్రమ్ 9493309972లను సంప్రదించవచ్చు. జిల్లాలోని క్రీడాకారులు ఈ అద్భుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిటీ కోరుతోంది.

## డీసీసీ పదవులు పొందిన వారికి నియోజకవర్గ నాయకుల ఆత్మీయ సన్మానం

**సికింద్రాబాద్, ఏప్రిల్ 10 (డిడి9 వార్త):**

జిల్లా కాంగ్రెస్ కమిటీలో సనత్‌నగర్ బీ బ్లాక్‌కు చెందిన హన్మంత్ రావు వైస్ ప్రెసిడెంట్‌గా, శ్రీకాంత్ గౌడ్, ఎస్ఎస్ రావు, రాజు యాదవ్ జనరల్ సెక్రటరీలుగా, ఖమర్ హమీద్, రోహిత్ ఆనంద్, రజినీ కాంత్, సాయి గౌడ్ సెక్రటరీలుగా, పద్మారాణి, వినోద్ సింగ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా, ప్రతాప్ నాయక్ స్పోక్‌స్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బ్లాక్ నాయకులు వారికి ఘనంగా సన్మానం నిర్వహించారు.కార్యక్రమంలో పార్టీకి అంకితభావంతో పనిచేసిన నాయకులను అభినందించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్త బాధ్యతలు స్వీకరించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. పదవులు పొందిన నాయకులు మాట్లాడుతూ డా. కోట నీలిమ మార్గదర్శకత్వంతోనే ఈ బాధ్యతలు దక్కాయని తెలిపారు. ఆమె నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పని చేస్తామని చెప్పారు. డా. కోట నీలిమ, డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.







# బాన్సువాడలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

- **182 మందికి రూ.54.34 లక్షల ఆర్థిక సహాయం అందజేసిన - పోచారం శ్రీనివాస్ రెడ్డి**

**బాన్సువాడ, ఏప్రిల్ 10(డిడి9 వార్త):**

బాన్సువాడ పట్టణ కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. తన నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 182 మంది లబ్ధిదారులకు రూ.54,34,000 విలువైన ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ప్రభుత్వం అండగా నిలబడేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు అనుకోని వైద్య ఖర్చులు లేదా ఇతర అత్యవసర అవసరాల సమయంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ నిధి ద్వారా సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి అర్హులైన వ్యక్తికి సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాల్లో సేవల నాణ్యతను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాల్లో భాగంగా అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేశారు. ఈ ఫోన్ల ద్వారా పిల్లల హాజరు, పోషకాహారం, ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను సులభంగా నమోదు చేయడంతో పాటు ప్రభుత్వ పథకాల అమలును సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని తెలిపారు. మండలాల వారీగా లబ్ధిదారులకు అందించిన సహాయం వివరాలు ఇలా ఉన్నాయి.బాన్సువాడ గ్రామీణ మండలం పరిధిలో 33 మందికి రూ.8,86,500, బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో 12 మందికి రూ.4,35,000, బీర్కూర్ మండలం 17 మందికి రూ.4,57,000, నసురుల్లాబాద్ మండలం 11 మందికి రూ.3,05,000, మొస్రా మండలం 11 మందికి రూ.2,66,000, చందూర్ మండలం 18



మందికి రూ.4,93,500, వర్ని మండలం 23 మందికి రూ.6,56,500, రుద్రూర్ మండలం 13 మందికి రూ.4,32,000, కోటగిరి మండలం 22 మందికి రూ.5,97,000, పోతంగల్ మండలం 18 మందికి రూ.7,93,000, అలాగే ఇతర నాలుగు మందికి రూ.1,12,500 చొప్పున సహాయం అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంపై కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా వైద్య అవసరాల సమయంలో ఈ సహాయం ఎంతో ఉపశమనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వం ఇలాంటి సహాయ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సాదాసీదాగా అయినప్పటికీ అర్థవంతంగా సాగింది.





# జాకొరా–చందూర్ ఎత్తిపోతల పథకాల ట్రయల్ రన్ విజయవంతం

- **10 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కీలక అడుగు**
- **పోచారం శ్రీనివాస్ రెడ్డి.**

**బాన్సువాడ, ఏప్రిల్ 10(డిడి9 వార్త):**

బాన్సువాడ నియోజకవర్గంలో రైతులకు సాగునీరు అందించే దిశగా కీలకమైన జాకొరా, చందూర్ ఎత్తిపోతల పథకాల పంపు మోటార్ల ట్రయల్ రన్‌ను శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. నిజాంసాగర్ నాన్ కమాండ్ ఏరియాలో సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో రూ.106 కోట్ల వ్యయంతో ఈ పథకాలు నిర్మించబడ్డాయి. త్వరలోనే ఈ పథకాలను అధికారికంగా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ పాల్గొని ట్రయల్ రన్‌ను పరిశీలించారు. పంపు మోటార్ల పనితీరును సమీక్షించి, నీటి సరఫరా వ్యవస్థపై అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా



పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, పంటల ఉత్పత్తి పెరిగి రైతుల ఆదాయం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఇలాంటి పథకాలతో వ్యవసాయ రంగానికి బలమైన మద్దతు అందిస్తున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో వర్ని, చందూర్ మండలాల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ఇరిగేషన్ అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతులు ఈ పథకాల త్వరితగతిన ప్రారంభం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.





## నా తండ్రి అలా చేయడం వల్లే మగవాళ్లంటే
# అసహ్యం పెరిగింది..



బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ నోరా ఫతేహి ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని తన వ్యక్తిగత జీవితం గురించి సంచలన విషయాలను పంచుకున్నారు. తెరపై గ్లామరస్‌గా కనిపించే ఆమె జీవితం వెనుక ఎంతో మానసిక వేదన ఉందని ఈ ఇంటర్వ్యూ ద్వారా తెలిసింది. ముఖ్యంగా తన చిన్నతనంలో తండ్రి వదిలేసి వెళ్లడం తనపై ఎలాంటి ప్రభావం చూపిందో ఆమె ఎమోషనల్‌గా వివరించారు. చిన్నప్పుడు తాను షకీరా, జెన్నిఫర్ లోపెజ్ వంటి సెలబ్రిటీలను చూసి స్ఫూర్తి పొందేదాన్నని, కానీ ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే తన తల్లి అంతకంటే గొప్ప స్ఫూర్తి అని నోరా అన్నారు. "మా అమ్మ ఒక సింగిల్ మదర్. తమ్ముడిని, నన్ను పెంచడానికి ఆమె పడరాని పాట్లు పడింది. మమ్మల్ని ఉత్తమంగా పెంచడం కోసం ఆమె ఎన్నో ఉద్యోగాలు చేస్తూ కష్టపడింది. నిజమైన స్ఫూర్తి మన చుట్టూ ఉన్న వ్యక్తుల నుంచే వస్తుందని నాకు అర్థమైంది" అని చెప్పుకొచ్చారు. సింగిల్ మదర్ పెంచడం వల్ల పురుషులతో తన సంబంధాలు ఎలా ఉన్నాయని యాంకర్ అడిగిన ప్రశ్నకు నోరా స్పందిస్తూ.. "నాకు నా తండ్రితో సమస్యలు ఉన్నాయి" అని నిజాయితీగా ఒప్పుకున్నారు.

తన తల్లిదండ్రులు విడాకులు తీసుకున్న తర్వాత, తండ్రి చాలా కాలం పాటు కనిపించకుండా పోవడంతో పురుషుల పట్ల అసహ్యం పెంచుకున్నట్లు తెలిపారు. ఆడపిల్లలు అలాంటి వాతావరణంలో పెరిగినప్పుడు, పురుషులు మహిళలను చూసే విధానంపై వ్యతిరేకత ఏర్పడుతుందని ఆమె అన్నారు. తండ్రి తనను వదిలేసి వెళ్లడం వల్ల తనలో భయం పెరిగిపోయిందని నోరా వెల్లడించారు. "ఒకవేళ ఎవరితోనైనా రిలేషన్ వర్కవుట్ కాకపోతే, వారు నన్ను వదిలేసి వెళ్తారనే నిజాన్ని నేను త్వరగా జీర్ణించుకోలేను. బ్రేకప్ నుంచి బయటపడటం నాకు చాలా కష్టం. గతంలో నాకు సరిపడని వ్యక్తులతో ప్రేమలో ఉన్నప్పటికీ, వారు నన్ను వదిలేస్తారనే భయం వల్ల నేను రిలేషన్ నుంచి త్వరగా బయటకు రాలేకపోయాను. ఇదంతా నా తండ్రి వల్ల నాలో కలిగిన మానసిక వేదన. అది నా తప్పు కాదు, కానీ నాపై ప్రభావం పడింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాను ఆ మానసిక సమస్యల నుంచి బయటపడటానికి ప్రయత్నిస్తున్నట్లు నోరా స్పష్టం చేశారు.

## ‘జననాయగన్’ సినిమాకు లీకుల బెడద.. డైరెక్టర్ రియాక్షన్ ఇదే..



కోలీవుడ్ స్టార్ హీరో, రాజకీయ నాయకుడు దళపతి విజయ్ నటిస్తున్న చివరి చిత్రం ‘జననాయగన్’ చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. ఓ వైపు ఆయన ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉండగా, మరోవైపు ఆయన చివరి సినిమాకు సంబంధించి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే సెన్సార్ సమస్యల వల్ల వాయిదా పడుతూ వస్తున్న ఈ చిత్రం నుంచి తాజాగా.. ఐదు నిమిషాల సీన్‌తో పాటు ఓ పాట లీక్ అవ్వడం ఇండస్ట్రీలో కలకలం రేపుతోంది. ఈ సినిమా నుంచి విజయ్ ఇంట్రడక్షన్ సీన్, టైటిల్ కార్డ్స్, దళపతి కచేరీ అనే పాటలో కొంత భాగం సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. ఏకంగా ఐదు నిమిషాల ఫుటేజీ బయటకు రావడంతో చిత్ర బృందం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. వెంటనే అలర్ట్ అయిన టీమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఈ లీక్ వెనుక ఎడిటింగ్ లేదా పోస్ట్ ప్రొడక్షన్ టీమ్ ప్రమేయం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


ఈక్రమంలో.. ఈ లీకులపై దర్శకుడు హెచ్ వినోద్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రతి సీన్ వెనుక ఎంతోమంది కళ, కష్టం, కలలు దాగి ఉంటాయి. సినిమా విడుదలకు ముందే ఇలా సీన్లు లీక్ అవ్వడం నిజంగా బాధాకరం. దయచేసి ఎవరూ వీటిని షేర్ చేయకండి, చిత్ర బృందానికి మద్దతుగా నిలవండి" అంటూ ఆయన అభిమానులను కోరారు. విజయ్ చివరి సినిమా కావడంతో ఫ్యాన్స్ కూడా ఈ లీకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌లో విజయ్ సరసన పూజా హెగ్డే, మమిత బైజు నటిస్తుండగా.. బాబీ డియోల్, ప్రియమణి, ప్రకాష్ రాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా వాస్తవానికి సంక్రాంతికే విడుదల కావాలి, కానీ సెన్సార్ (CBFC) అభ్యంతరాల వల్ల కోర్టు గడప తొక్కింది. ప్రస్తుతం ఈ లీకుల గొడవ సద్దుమణిగాక, కొత్త విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.

## మ్యాడక్ ఫిలింస్ డ్రీమ్ ప్రాజెక్ట్ నుంచి దీపికా ఔట్..
# ఆ భారీ సినిమాలో చాన్స్ కొట్టేసిన శ్రద్ధా కపూర్!

బాలీవుడ్ ముద్దుగుమ్మ శ్రద్ధా కపూర్ ఇప్పుడు ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది. ‘స్త్రీ’ సినిమాతో మ్యాడక్ ఫిలింస్‌కు కాసుల వర్షం కురిపించిన ఈ బ్యూటీ, ఇప్పుడు అదే బ్యానర్‌లో రాబోతున్న అతిపెద్ద ప్రాజెక్ట్ ‘మహావతార్’ లో భాగం కాబోతున్నట్లు తెలుస్తోంది. పరశురాముడిగా నటిస్తున్న విక్కీ కౌశల్ సరసన శ్రద్ధా కపూర్ ఎంపిక దాదాపు ఖరారైనట్లేనని సమాచారం.

నిజానికి ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం మొదట దీపికా పదుకొణె పేరు గట్టిగా వినిపించింది. కానీ, పరశురాముడి లాంటి పవర్‌ఫుల్ క్యారెక్టర్ పక్కన శ్రద్ధా కపూర్ ఉంటే ఆ క్రేజ్ వేరేలా ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారట. పైగా మ్యాడక్ ఫిలింస్ కు శ్రద్ధా ఒక గోల్డెన్ లెగ్. ఆమె ఉంటే సినిమా హిట్టే అనే సెంటిమెంట్ కూడా ఉండటంతో, శ్రద్ధా వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. జూన్ తర్వాత షూటింగ్ మొదలయ్యే ఈ సినిమాలో శ్రద్ధా పాత్ర చాలా ఎమోషనల్‌గా, బలంగా ఉంటుందని సమాచారం.

ఒకవేళ శ్రద్ధా ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, మ్యాడక్ ఫిలింస్ బ్యానర్‌లో ఆమెకు ఇది ఐదో సినిమా అవుతుంది. ప్రస్తుతం శ్రద్ధా రేంజ్ మాములుగా లేదు. ఒకవైపు ‘స్త్రీ 3’ పనుల్లో బిజీగా ఉంటూనే, మరోవైపు ‘ఈత’ అనే బయోపిక్ మూవీలో నటిస్తోంది. ఇప్పుడు ‘మహావతార్’ కూడా తోడవ్వడంతో అమ్మడు ఫుల్ బిజీ అయిపోయింది. దర్శకుడు అమర్ కౌశిక్ ఈ సినిమాను ఇండియన్ స్క్రీన్ పై మునుపెన్నడూ చూడని విధంగా మలిచేందుకు ప్లాన్ చేస్తున్నారు. పరశురాముడి జీవిత కథ ఆధారంగా వస్తున్న ఈ చిత్రం మైథలాజికల్ టచ్‌తో కూడిన భారీ యాక్షన్ డ్రామాగా ఉండబోతోందని తెలుస్తోంది. ఇక మ్యాడాక్ ఫిలింస్ డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రాబోతున్న ఈ సినిమాలో విక్కీ కౌశల్ శ్రద్ధా కపూర్ కాంబినేషన్ వెండితెరపై ఒక ఫ్రెష్ ఫీలింగ్‌ను ఇస్తుందని ఫ్యాన్స్ కూడా తెగ ఖుషీ అవుతున్నారు.






## ఆ సినిమాలంటే పిచ్చి.. అవసరమైతే కోసేసుకుంటా..
# మాస్ స్టేట్‌మెంట్ ఇచ్చిన యంగ్ హీరో



ప్రస్తుతం మంచి జోష్‌తో కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్న యువ నటుల్లో కిరణ్ అబ్బవరం ఒకరు. ఇప్పటివరకు నటుడిగా మంచి గుర్తింపు సంపాదించుకున్న ఈయన, తాజాగా ‘తిమ్మరాజుపల్లి టీవీ’ చిత్రాన్ని నిర్మిస్తూ నిర్మాతగా కూడా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. ఈ సినిమాను ఏప్రిల్ 17న విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో చిత్రబృందం ఇటీవల ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు కిరణ్ అబ్బవరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన నందమూరి బాలకృష్ణ నటించిన ‘చెన్నకేశవ రెడ్డి’ చిత్రంలోని గెటప్‌లో ఈవెంట్‌కు హాజరై అందరి దృష్టిని ఆకర్షించారు.

ఈ కార్యక్రమంలో మాట్లాడిన కిరణ్ అబ్బవరం, తనకు నందమూరి బాలకృష్ణ నటించిన ‘చెన్నకేశవ రెడ్డి’, ‘సమరసింహా రెడ్డి’, ‘నరసింహ నాయుడు’ సినిమాలు అంటే ఎంతో ఇష్టమని, వాటి కోసం కోసేసుకుంటా అని వ్యాఖ్యానించారు. అందుకే ‘చెన్నకేశవ రెడ్డి’ గెటప్‌లో ఈవెంట్‌కు వచ్చానని చెప్పారు. మొదట ఈ గెటప్‌కు సరిపోయే విధంగా మీసాలు కూడా పెట్టాలని అనుకున్నానని, అయితే మరుసటి రోజు షూటింగ్ ఉండటంతో అది సాధ్యపడలేదని ఆయన వెల్లడించారు. ఇలా నందమూరి బాలకృష్ణ సినిమాలపై తనకున్న అభిమానాన్ని ప్రత్యేకంగా వ్యక్తపరుస్తూ ‘చెన్నకేశవ రెడ్డి’ గెటప్‌లో ఈవెంట్‌కు హాజరైన కిరణ్ అబ్బవరంపై బాలయ్య అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇక ‘తిమ్మరాజుపల్లి టీవీ’ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# ఇప్పుడే మొదలెట్టినట్లుంది!

“దక్షిణాది ప్రేక్షకులు నా పట్ల ఎప్పుడూ ఎంతో ప్రేమతో ఉంటున్నారు. నన్ను వాళ్ల కుటుంబంలోని వ్యక్తిలా ఆదరించారు. ఇది నాలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది” అంటోంది తమన్నా. ఓవైపు మహిళా ప్రాధాన్య చిత్రాలు, మరోవైపు ఓటీటీ కథలు.. ప్రత్యేక పాటలు.. ఇలా ఎదురొచ్చిన అవకాశాన్ని అందుకుంటూ అభిమానుల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుందీమె. ఈ మధ్యే సినీ రంగంలో 21ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న తమన్నా మాట్లాడుతూ.. “ప్రస్తుతం నేను నటించిన చిత్రాలన్నీ ఒక్కొక్కటిగా విడుదల కాబోతున్నందుకు ఉత్సాహంగా ఉన్నా. చాలా మంది నటీనటులకు.. ముఖ్యంగా నటీమణులకు ఇలాంటి అవకాశం లభించదు. నా కెరీర్ మొదలై దాదాపు 21ఏళ్లు అయ్యింది. అయినా ఇప్పుడే మళ్లీ ప్రారంభిస్తున్నట్లుగా ఉంది. దక్షిణాది పరిశ్రమలో లభిస్తున్న ఆదరణ నాకు మరింత ఉత్తేజాన్ని కలిగిస్తుంది. అందుకే నేను కూడా వారిని కొత్త కథలు, ప్రయోగాత్మక చిత్రాలతో అలరించాలని భావిస్తున్నాన”ని చెప్పుకొచ్చింది.



## అజిత్‌తో రైడ్.. ఎన్నో విషయాలు
# నేర్చుకున్నా

నటి మంజు వారియర్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన లద్దాఖ్ బైక్ ట్రిప్ విశేషాలను గుర్తు చేసుకున్నారు. అజిత్ కుమార్‌తో కలిసి 14 రోజుల పాటు సాగిన ఈ ప్రయాణం తనకు ఎన్నో విషయాలు నేర్పిందన్నారు.

“అజిత్‌తో కలిసి చేసిన ఆ రైడ్ నా కళ్లు తెరిపించింది. లద్దాఖ్‌లో వాళ్ల టీమ్‌ను కలిశాను. సుమారు 14 రోజుల పాటు వారితో కలిసి ప్రయాణించాను. అజిత్ కుమార్ ఎన్నో విషయాలు నేర్పారు. ఒకవేళ మనకు ప్రమాదం జరిగితే, మనల్ని మనం ఎలా కాపాడుకోవాలి అనేది మొదటి రోజే చెప్పారు. నాకు బైక్ నడపడం వచ్చు కానీ, అప్పట్లో నా దగ్గర లైసెన్స్ లేదు. వారంతా ప్రొఫెషనల్ రైడర్స్ కావడంతో వారితో కలిసి మేనేజ్ చేయడం నాకు కొత్తగా అనిపించింది. ఆ ట్రిప్ పూర్తయ్యాక నేను లైసెన్స్ తీసుకున్నాను” అని మంజు చెప్పారు.

అజిత్‌కు సినిమాలు అంటే ఎంత ఇష్టమో మోటార్ రేసింగ్ కూడా అంతే ఇష్టం. ఎన్నోసార్లు రేసింగ్ పోటీల్లో పాల్గొన్నారు. ‘అజిత్ కుమార్ రేసింగ్’ పేరుతో టీమ్‌ను కూడా నిర్వహిస్తున్నారు. మంజు వారియర్, అజిత్ కలిసి ‘తునివు’ (తెలుగులో తెగింపు)లో నటించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వీరిద్దరూ కలిసి లద్దాఖ్ ట్రిప్‌నకు వెళ్లారు.



## ఈ ఏడాది గొప్ప చిత్రాల్లో
# ‘డెకాయిట్’ ఒకటి



డివి శేష్ ప్రధాన పాత్రలో షానియల్ డియో దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘డెకాయిట్’. భారీ అంచనాల మధ్య నేడు ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకుంది. తాజాగా దీనిపై నటుడు నాని చిత్రబృందాన్ని అభినందిస్తూ పోస్ట్ పెట్టారు.

‘డెకాయిట్’ మనసును హత్తుకునే నిజమైన బ్లాక్‌బస్టర్ అని.. థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ మిస్ కావద్దని నాని ప్రేక్షకులను కోరారు. ఈ సినిమాలో అడివి శేష్ నటన అద్భుతమని కొనియాడారు. ఇది అతని కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన అని అన్నారు. నటి మృణాల్ ఠాకూర్ తన పాత్రలో చాలా అందంగా ఒదిగిపోయారన్నారు. ఆమె ఖాతాలో మరో గొప్ప సినిమా చేరిందని ప్రశంసించారు. రచన, స్క్రీన్‌ప్లే విభాగం పనితీరును మెచ్చుకున్నారు. ఈ ఏడాదిలోని గొప్ప చిత్రాల్లో ఇదీ ఒకటిగా నిలిచిపోతుందని.. ఇలాంటి సినిమాను నిర్మించినందుకు సుప్రియను ప్రత్యేకంగా అభినందించారు. నాని పోస్ట్‌కు అడివి శేష్ రిప్లై ఇచ్చారు. ఈ రివ్యూ చూసిన తర్వాత తన హృదయం ఆనందంతో నిండిపోయిందన్నారు. ‘డెకాయిట్’ టీమ్ మరింత ఉత్సాహంగా ఉందన్నారు.

